వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 01 మే 2025

## మంత్రిని కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



ఉమ్మడి కడప జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గా నియమింపబడ్డ రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన ఎర్రగుంట్ల జయప్రకాష్ బుధవారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో జయప్రకాష్ కలిశారు. పదవి వచ్చేందుకు సహకరించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం మంచి అవకాశం ఇచ్చిందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంత్రి పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పటికైనా అవకాశం లభిస్తుందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గ పరిస్థితులపై ఇద్దరు చర్చించారు.

## ప్రధాని మోడీ రాజధాని పర్యటన అమరావతి అభివృద్ధికి ఓ మైలు రాయిగా మారబోతుంది

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ నాయుడు

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

మోడీ పర్యటన ఈసారి రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో ఓ మైలు రాయిగా మారబోతుందనీ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ నాయుడు పేర్కొన్నారు. మోడీ ఇప్పుడు అమరావతికి రావడం ద్వారా పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు మన ఏపీ వైపు చూస్తున్నారన్నారు. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని ఆనాడు అమరావతిని రాజధానిగా ప్రకటించారన్నారు. తాజాగా కేంద్రం కూడా రెండు వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చి.. రాజధాని అభివృద్ధికి సహకరించిందన్నారు. చంద్రబాబు పిలుపు మేరకు 34వేల ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారనీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం.. రైతులు చేసిన త్యాగం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. జగన్ అనే విషనాగు అధికారంలోకి రావడం మన రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. మూడు రాజధానుల పేరుతో.. రాష్ట్రాన్ని ముక్కలు చేసేందుకు జగన్ కుట్ర చేశారనీ ధ్వజ మెత్తారు. తాగు, సాగు నీరు, పరిశ్రమలు ఇస్తే చాలని రాయలసీమ ప్రజలు, ఉత్తరాంధ్ర ప్రజలు ఉపాధి చూపితే చాలు అని కుటుంబ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారన్నారు. రాజధాని రాష్ట్రం మధ్యలో ఉంటేనే మంచిదని అందరూ ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. అయినా జగన్ మాత్రం తన స్వార్ధ ప్రయోజనాల కోసం అమరావతిని అప్రతిష్టపాలు చేసి పాపం మూట కట్టుకోవడం జరిగిందన్నారు. అమరావతి గురించి ఎవరైనా మాట్లాడితే అన్యాయంగా కేసులు పెట్టించి వేధించారని గుర్తు చేశారు. అందుకే మొన్న ఎన్నికలలో ప్రతిపక్ష హోదా కూడా దండుగ అని ప్రజలు జగన్ కు తగిన విధంగా బుద్ధి చెప్పారని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేలా చంద్రబాబు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారని కొనియాడారు.

# జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతి భేష్...





కడప, ఏప్రిల్ 30 : ప్రభాతవార్త

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా.. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు ఆశాజనకంగా, చురుగ్గా సాగుతుండడం హర్షణీయం అని జిల్లా ఇంచార్జి అధికారి (రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రెటరీ) సౌరబ్ గౌర్ సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ లతో కలిసి జిల్లా ఇంచార్జి అధికారి (రాష్ట్ర పౌర సరఫరాల శాఖ.కమీషనర్ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రెటరీ) సౌరబ్ గౌర్ జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి అధికారి సౌరబ్ గౌర్ మాట్లాడుతూ జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు రానున్న 10 సంవత్సరాల్లో అతిపెద్ద ఇండస్ట్రియల్ క్లస్టర్ గా అభివృద్ధి చెందుతుందని, అందుకు తగ్గ అన్ని రకాల వనరులు మనకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రధానంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ క్లస్టర్ లో సిసి కెమెరాలు, ఎలెక్ట్రిక్ స్మార్ట్ మీటర్స్, టెలికాం కేబుల్స్ తోపాటు టెలివిజన్ మాన్యుఫ్యాక్చర్ కంపెనీలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన కంపెనీలతో మాట్లాడి డిఎఆర్ లను కూడా సిద్ధం చేయాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. స్టార్ట్ అప్ కడప ఇంప్లిమెంటేషన్ లో భాగంగా జిల్లా కేంద్రంలో అధునాతన వసతులతో స్టార్ట్ అప్ సెంటర్ (ఎంటర్ ప్రెన్యూర్షిప్ సెంటర్) భవన నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని.. ఈ నిర్మాణం పూర్తయితే.. నూతన పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల నైపుణ్యాలను సమకూర్చి జిల్లా ఆర్థిక పురోగతికి అడుగులు వేయడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా అన్ని రంగాల్లో జిల్లా ఆర్థిక పురోగతిపై సంబందిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా ప్రత్యేక అధికారి సౌరబ్ గౌర్ సమీక్షించారు. సంబంధిత అంశాల్లో సలహాలు, సూచనలు అందించి భవిష్యత్తులో జిల్లా ఆర్థిక ప్రగతిని మూడు రెట్లు పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. ప్రాథమిక రంగాలతో పాటు.. రానున్న ఐదేళ్లలో జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాల ప్రణాళికలను పిపిటి ద్వారా క్షుణ్ణంగా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా జిల్లాలో ప్రధానంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రధానంగా జిల్లా ముఖచిత్రంతో పాటు.. స్వర్ణాంధ్ర 2047, డిఆర్డీఏ, ఎంజిఎన్ఆర్ఈజీఎస్, డ్వామా పీఎంకేఎస్వై 2.0, ఎపిఐఐసి, జిల్లా పరిశ్రమల కేంద్రం, వ్యవసాయం, ఉద్యాన. పంటల సాగు తదితర అనుబంధ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ప్రాథమిక రంగాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 30 : ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ మంత్రి సవితమ్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య బుధవారము ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ లో మర్యాదపూర్వకంగా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా మంత్రి సవితమ్మతో డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అత్యంత వెనకబడి ఉన్న ఆర్యవైశ్య కుటుంబాలకు ప్రభుత్వం తరఫున బడ్జెట్ కేటాయించి ఆర్యవైశ్య కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య మంత్రిని కోరారు ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ సానుకూలంగా స్పందించి ఆర్యవైశ్య కుటుంబాలకు బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తానని మంత్రి సవితమ్మ పరిటాల వెంకటసుబ్బయ్యకు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## ప్రజలకు ఏళ్ల వేళలా అందుబాటులో ఉంటా

### ప్రజాదర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల, ఏప్రిల్30, ప్రభాతవార్త:

ప్రజలు ఎవరు అధైర్య పడవద్దు అని ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటాను అని ప్రజా దర్బార్ లో ప్రజలతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన నివాసం వద్ద ప్రజలు వారి సమస్యలు వివరించడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఓపికగా ప్రజల సమస్యలు తెలుసుకొని వారి సమస్యల గురించి సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఎవరు కూడా అధైర్య పడవద్దు అని ప్రస్తుత ప్రభుత్వం కక్షయ పూరిత పాలన చేస్తోంది అని మళ్ళీ త్వరలో మన ప్రభుత్వమే వస్తుందని అంత వరకు ఓపిక పట్టండి అని ఒక వేళ ఎవరికి అన్యాయం జరిగిన పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామని ప్రజలకు భరోసా కల్పించారు.

## చంద్రబాబుతోనే దేశమంతా అమరావతి వైపు

### రాజధానికి ప్రధాని మోడీ రాక ఓ మైలురాయి
### టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

ఆంధ్రుల భవిష్యత్తుకు మనిమకుటంలాగా రాజధాని అమరావతి చరిత్రలో నిలిచిపోతుందని తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. చంద్రబాబు మీద నమ్మకంతోనే రైతులు వేల ఎకరాల భూములు రాజధాని నిర్మాణం కోసం అందజేశారని పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు ప్రధాని మోడీ రాజధాని పునర్నిర్మాణ పనులకు రాక ఓ మైలురాయిగా రాష్ట్రంలో నిలుస్తుందని అన్నారు. ఒక మనిషిని నమ్మి వేల ఎకరాలు ఇచ్చారంటే ఆయన పరిపాలనపై ఉన్న అపారమైన విశ్వాసం అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి అయితే యువత భవిష్యత్ బంగారు మయం అవుతుందన్నారు. ఆంధ్ర ప్రజల భవిష్యత్తు నాశనం చేసేందుకు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరు చెప్పి పెట్టుబడి దారులు రాకుండా నాశనం చేశారని మండిపడ్డారు. రాజధానిని శ్మశానం అన్న వాళ్లే ఐదేళ్లు అక్కడ నుండే పరిపాలించారని గుర్తుంచుకోవాలన్నారు. అమరావతి నిర్మాణానికి మద్దతుగా కేంద్ర ప్రభుత్వం నిలబడింది అంటే చంద్రబాబు పరిపాలన మీద నమ్మకంతోనే అన్నారు. కూల్చడం తప్ప నిర్మించడం తెలియని వైసీపీ నాయకులకు అమరావతి గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. ప్రతి ఆంధ్రుడు గర్వ పడేలా అమరావతి నిర్మాణం ఉంటుందన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో ముఖ్యమంత్రి చంద్ర బాబు చూపిస్తే, విధ్వంసం అంటే ఏమిటో జగన్ రెడ్డి చూపించారనీ వ్యాఖ్యానించారు. ప్రజల కోసం, వారి భవిష్యత్తు కోసం, బావి తరాలు మనుగడ కోసమే అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

కడప, ఏప్రిల్ 30 : ప్రభాతవార్త



పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి)సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి.. మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని.. మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా.. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రాత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబందించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్ లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపణపై అవగాహన పెంపొందించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐ.డి.పి.) 202327 ద్వారా ఎస్సి, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 19 ట్రాన్స్పోర్ట్ వాహనాల ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ కింద రూ 1.93 కోట్ల రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలుపగా.. ట్రాన్స్పోర్ట్ వెహికలకు సంబంధించి తనిఖీ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్ కు వివరించగా.. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, ఏపీఐఐసీ జెడ్ ఎం శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్, ఐపివోలీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జనార్దన్, డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్, డిక్కీ కోఆర్డినేటర్ శివ శంకర్, ఏపీఐఐసీ ప్రతినిధులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక డిడిఆర్ఎఫ్ అధికారులు, డిటిఓ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడీసీఎల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి మామిడి తోటను పరిశీలించిన అధికారులు.

కలకడ ఏప్రిల్ 30 ప్రభాతవార్త :



మామిడి చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా ఉద్యాన శాఖాధికారి రవి చంద్ర బాబు, జిల్లా పరిశ్రమల కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణారావు బుధవారం కలకడ మండలం కోన గ్రామంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగవుతున్న మామిడి తోటను పరిశీలించారు. వ్యవసాయ శాఖలో ఏఈవోగా తిరుపతిలో పనిచేస్తున్న కోన గ్రామానికి చెందిన విశ్వనాథ్ తనకున్న 16 ఎకరాల్లో మామిడి తోటను సాగుచేస్తున్నాడు. గతంలో రసాయనిక పద్ధతుల్లో తోటను సాగు చేయగా ఈ ఏడాది పీలేరుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి ప్రోత్సాహంతో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తన తోటను సాగు చేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర బాబు, జిల్లా పరిశ్రమల కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణారావు పరిశీలించారు. ప్రస్తుతం తోటలో చేపట్టిన యాజమాన్య పద్ధతులు, వాడుతున్న కషాయాలు, వాటి తయారీ, పిచికారి, అవుతున్న ఖర్చు, రసాయనిక ఎర సువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో గమనించిన తేడాలు, పెట్టుబడుల ఖర్చు వంటి విషయాలను వారు విశ్వనాథ్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు హెచో సుకుమార్ రెడ్డి, వీహెచ్ఎ అక్రమ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## హాజ్‌యాత్రకు వెళ్ళే వారికి పెద్దపీట

### హజ్ కమిటీసభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్

మదనపల్లె, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :



సమావేశంలో పాల్గొన్న దృశ్యం

హాజ్‌యాత్రకు వెళ్ళే వారికి సౌకర్యాల కల్పనలో పెద్దపీట వేయనున్నట్లు హాజ్‌కమిటీ సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్ తెలిపారు. బుధవారం రాష్ట్ర హాజ్‌కమిటీ సభ్యునిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి హాజ్‌కు వెళ్ళేవారికి బెంగుళూరు, హైదరాబాద్ విమానశ్రమంలో మౌళిక తసతులు కల్పిస్తామన్నారు. ముఖ్యంగా రాయలసీమ వాసులకు ప్రత్యేక సౌకర్యాలు ఉంటాయన్నారు. హాజ్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాన్, మంత్రి ఫారూక్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. హాజ్ యాత్రకు వెళ్ళే వారికి నోడల్ అధికారులను నియమించడం జరుగుతుందన్నారు. విమానశ్రయ ప్రాంతాల్లో అత్యవసరవైద్య సదుపాలు కల్పించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో హాజ్ కమిటీ ఛైర్మెన్ ఎస్‌ఎంబాషా, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మెన్ మౌళానాముస్తాకఅహ్మద్, కేంద్ర హాజ్‌కమిటి, రాష్ట్ర హాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసం విద్యార్థులకు ఎంతో అవసరం

మదనపల్లె, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

ఇంజనీరింగ్ విద్యార్థులకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసంకూడా ప్రతి విద్యార్థి జీవన ప్రమాణంలో కీలకపాత్ర పోషిస్తుందని మొటివేషన్ స్పీకర్, ట్రైనర్ ఎన్ఎస్.రెడ్డి తెలిపారు. బుధవారం పుంగనూరు రోడ్డులోని వలసపల్లె వద్ద ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థికి కమ్యూనికేషన్‌తో ఎలా అవకాశం సద్వినియోగంచేసుకోవచ్చు అనే అంశంపై వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ కేరియర్ అబివృద్ధిలో కమ్యూనికేషన్ నైపుణ్యాల ప్రాధాన్యత ఎంత ప్రాధాన్యత ఉందో వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ అభ్యుదయాన్ని సాధించాలంటూ తరచూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈకార్యక్రమంలో కేరియర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జ్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ టి.అమరనాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి వై.అమరనాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## రాయచోటిలో రెచ్చిపోయిన దొంగలు.. 50 తులాల గోల్డ్ తో పరార్

రాయచోటి ఏప్రిల్ 30 ప్రభాతవార్త



రాయచోటి పట్టణంలోని రాజు స్కూల్ సమీపంలో ఓ ఇంట్లో భారీ చోరీ చేశారు. విజయ్ భాస్కర్ అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలోని అరకేజీ బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. కుమార్తె పెళ్లి కోసం నగలు కొనుగోలు చేశామని తెలిపారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ వెంకట చలపతి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాయచోటి పట్టణంలోని నిఘా నేత్రాలతో దొంగల ఆచూకీని పట్టుకుంటామని ఆయన సూచించారు.

## మొదటిసారిగా నీట్ మరియు ఐఐటి ఫౌండేషన్ కోర్సుల బోధన

రాయచోటి ఏప్రిల్ 30 ప్రభాతవార్త



శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్, మాసాపేట, రాయచోటి నందు తొలిసారిగా ఐఐటీ మరియు నీట్ ఫౌండేషన్ కోర్సుల బోధన కోసం ప్రసిద్ధ విద్యా సంస్థ Resonance తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మరియు తల్లిదండ్రులలో అవగాహన కల్పించేందుకు Resonance డైరెక్టర్ మిస్టర్ రాహుల్ (IIT కాన్పూర్) మరియు వారి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఐఐటీ, నీట్ పరీక్షల ప్రాముఖ్యత, విద్యార్థుల భవిష్యత్తుపై ఈ కోర్సుల ప్రభావం తదితర అంశాలపై వివరణాత్మకంగా వివరించారు. 2025-2026 విద్యా సంవత్సరంనుండి శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్ లో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు Resonance పద్ధతిలో ఐఐటీ మరియు నీట్ ఫౌండేషన్ కోర్సులు బోధించబడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ సాయి విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీ హీరా రాజ్పుత్ గారు పాల్గొని తల్లిదండ్రులకు మరియు విద్యార్థులకు ఈ కోర్సుల ప్రయోజనాలపై సూచనలు అందించారు. స్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీ కె.వి. త్యాగరాజన్ ఈ విషయాన్ని ఓ ప్రకటనలో వెల్లడించారు.

## నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవు

బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవన సిఐ నాగభూషణ్ పేర్కొన్నారు. బుధవారం గోపవరం మండలంలోని పిపి కుంట వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనీ, లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలను నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు..ఎస్ ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ నిబంధనలను పాటించని వారికి అపరాధ రుసుము విధించామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అదేవిధంగా కారు తదితర వాహనాలనును నడిపే వ్యక్తులు సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కలమల్ల ఎస్ఐగా సునీల్



యర్రగుంట్ల ఏప్రిల్ 30 ప్రభాతవార్త

మండల పరిధిలోని కలమల్ల పోలీస్ స్టేషన్ ఎస్ ఐగా సునీల్ కుమార్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న త్రిమూర్తి కలసపాడు పిఎస్ కు బదిలీ కాగా కడప సైబర్ క్రైమ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సునీల్ కుమార్ రెడ్డి కలమల్ల పిఎస్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సునీల్ కుమార్ రెడ్డికి పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

## జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపిగా ఆదినారాయణ



ఒంటిమిట్ట ఏప్రిల్ 30( ప్రభాతవార్త)

సిద్ధవటం సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా ఒంటిమిట్టకు చెందిన న్యాయవాది గాదె ఆదినారాయణరావును నియమిస్తూ బుధవారం ప్రభుత్వము ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా న్యాయవాది గాదె ఆదినారాయణరావు బుధవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ తాను గత 12 సంవత్సరాల నుంచి న్యాయవాది వృత్తిలో బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిజాయితీగా ధర్మబద్ధంగా వృత్తిపరంగా ప్రజా సేవ చేస్తున్న తనను ప్రభుత్వము సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా నియమించినందుకు చాలా సంతోషంగా ఉందని తెలియజేశాడు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

వాల్మీకిపురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో బుధవారం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో "ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వాల్మీకిపురం పట్టాభిరామ స్వామి దేవస్థానం, తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలకు గొప్ప చరిత్ర ఉన్నదని, ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ చైర్మన్‌తో సంప్రదించి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. అలాగే, గండికోట రిజర్వాయర్ నుంచి తాగు నీటిని గుర్రంకొండ మండలంలోని సంగసముద్రం ద్వారా వాల్మీకిపురానికి తీసుకురావడంపై కృషి చేస్తున్నట్లు తెలిపారు. సబ్ జైల్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నామని, ఫైర్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి లభించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణం ప్రారంభిస్తామని వెల్లడించారు. పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అర్హులైన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం తహసీల్దార్లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ప్రజా సమస్యలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు పలు సమస్యలపై ప్రజా దర్బార్‌ను ఆశ్రయించగా, వెంటనే అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమోళి, మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, మాజీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, వాల్మీకిపురం మాజీ సర్పంచ్ రాజేంద్ర చారి (రాజన్న), చింతపర్తి శేషాద్రి రెడ్డి, పీవీ నారాయణ, కోసూరి రమేష్, బొక్క బ్రదర్స్, డిష్ బ్రదర్స్, మండల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నేత్ర శిబిరం ఏర్పాటు

ఒంటిమిట్ట ఏప్రిల్ 30( ప్రభాతవార్త)



మా నేత్ర వైద్యశాల డాక్టర్ దినేష్, సింధు భార్గవి కంటి వైద్య నిపుణుల సలహాల మేరకు నేత్ర వైద్యశాల సిబ్బంది బుధవారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట మెయిన్ బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మండల ప్రజల సౌలభ్యం కొరకు ఉచిత నేత్ర శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కంటి వైద్య శిబిరంలో మండలానికి చెందిన ప్రజలు 30 మంది దాదాపుగా పాల్గొని వైద్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్ బాబు నేతృత్వంలో వైద్య సిబ్బంది మండల ప్రజలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి నాణ్యమైన మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మండల ప్రజలతో మాట్లాడుతూ కడప పట్టణంలో నాగరాజు పేట లోని తులసమ్మ హాస్పిటల్ పక్కన నూతనంగా మా నేత్ర వైద్యశాల స్థాపించబడిందని అనుభవం కలిగిన వైద్యుల పర్యవేక్షణలో ప్రజాసేవ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కావున నేత్ర కారణంగా వ్యాధులకు తమ వద్ద నాణ్యత కలిగిన వైద్యం అందుతుందని నేత్ర కారణంగా వ్యాధులు ఉన్నట్లయితే తమ వైద్యశాలకు వచ్చి తమ వైద్యులు అందించే వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే భూ సమస్యలపై ఆరా



రిసర్వే సమస్యలను వింటున్న జిల్లా అధికారి లక్ష్మీ ప్సాద్

పెద్దమండెం ఏప్రిల్ 30 ప్రభాతవార్త

మండలంలో ఇటీవల నిర్వహిస్తున్న భూరి సర్వే వెలిగల్లు సిద్ధవరం తదితర పంచాయతీలలో సమస్యలు తలత్యాన్ని వాటిని పరిష్కరించడానికి జిల్లా కేంద్రం నుండి అధికారి అశ్వి ప్రసాద్ వచ్చారు పంచాయతీలలో టీ సర్వే పై సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు వీటిని పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులకు తమ సూచనలు చేశారు ఇటువంటి సమస్యలను పరిష్కారం సమస్య కాదని క్షుణ్ణంగా పరిశీలించి భూ సర్వే నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. ఇందులో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సయాద్ అహ్మద్ సర్వేయర్ ఆరేలు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పదవి వివరణ సభ

పెండ్లిమర్రి ఏప్రిల్ 30 ప్రభాతవార్త



మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం యుఎోపిఆర్డి రఘునాథ రెడ్డి పదవి వివరణ పొందారు ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయనకు పూలమాలతో సత్కరించి శాలవాటు ఘనంగా నిర్వహించారు అలాగే ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి అందరికీ అనుకూలంగా ఉండి సమస్యలు ఉన్నా పరిష్కరించి తన సిబ్బందితో అన్ని పనులు సేవించి తనకు మంచి పేరు స్థానం లభించిందని సంతోషించారు. పంచాయతీ కార్యదర్శులకు మంచి సూచనలు ఇచ్చారని ఆరోగ్య ఐశ్వర్యాలతో మంచి జరగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య ఎంపీపీ వరలక్ష్మి ఎంఎం డీవో జగన్మోహన్ రెడ్డి సర్పంచులు గంగిరెడ్డి ప్రతాప్ రెడ్డి టిడిపి నాయకులు అన్నమయ్య ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు తరదర్ పాల్గొన్నారు.

# కాన్సర్స్, వడ దెబ్బ పై ప్రజలకు అవగాహన

వాల్మీకిపురం ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

కాన్సర్స్ మరియు వడ దెబ్బ పై ప్రజలకు అవగాహన అవసరం అని ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ మరియు టి. బి. పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి వారి ఆదేశాల మేరకు వాయల్పాడు మండలం నగరిమడుగు పి. హెచ్. సి. పరిధిలోని వాయల్పాడు అర్బన్ లోని ఎన్టీఆర్ కాలనీలో ప్రజలకు వడదెబ్బ, కాన్సర్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ మాట్లాడుచు గత సంవత్సరము నవంబర్ 14 వ తేదీ నుండి ఇంటింటి కాన్సర్ సర్వే నిర్వహించడం జరుగుచున్నదని ఇప్పటివరకు మండలం లో 39శాతం సర్వే 18సంవత్సరాల పై బడిన వారికి నోటి, రొమ్ము, గర్భషయ కాన్సర్స్‌పై సర్వే మరియు స్క్రీనింగ్ పూర్తి ఐనదని అన్నారు. అందరికి క్యాన్సర్ పరీక్షలు లో భాగంగా ప్రతీ ఇంటిని ఆశా కార్యకర్త, ఏ. ఎన్. ఎమ్, ఎమ్. ఎల్. హెచ్. పి లు సందర్శించి డేటా సేకరించి స్క్రీనింగ్ చేస్తున్నారని అన్నారు. అనుమానిత కేసులను వైద్యులు చూసి పరీక్షలు చేసిన తరువాత వారికి రెఫెర్ చేయవలసి వస్తే ఆశా కార్యకర్తలు ద్వారా జిల్లా అస్పత్రికి పంపించి తదుపరి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి ఒకవేళ నిర్ధారణ ఐతే వీలైనంత త్వరగా చికిత్స ప్రారంభిస్తారణి తెలిపారు. ఎండలు క్రమేపి ఎక్కువ అవుచున్న దరిమిలా ఇప్పటికే వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖలు హెచ్చరికలు జారీచేసాయి. కావున ప్రజలు వడ దెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలి. ఎక్కువగా ఎండకు గురి కావడం వల్ల మెదడు లో ఉష్ణోగ్రత ను నియంత్రణ చేసే కేంద్రం దెబ్బతిని వడ దెబ్బ కు గురి అయి సరైన సమయం లో ప్రథమ చికిత్స అందక పోతే చనిపోయే ప్రమాదం ఉంద న్నారు. ముఖ్యంగా వడ దెబ్బకు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే గర్భవతి, భాలింతలు, 10సంవత్సరాల లోపు పిల్లలు, 60సంవత్సరాల పైబడిన వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. పొలం పనులు చేయు కూలీలు, రైతులు ఉదయం ఆరు గంటలనుండి పదకొండు గంటల వరకు మరియు సాయంత్రం నాలుగు గంటల పైబడి మాత్రమే పని చేయాలి. ప్రతీ గంట కు గ్లాస్ నీరు త్రాగాలి. ఓ. ఆర్. ఎస్. పాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలి. అత్యవసరం ఐతే తప్ప 11గం పైన బయటకు వెళ్ళరాదు. వెళ్ళవలసి వస్తే గొడుగు తీసుకెళ్లాలి. మాంసాహారం, ఉప్పు, కారం, మసాలాలు తగ్గంచి తినాలి. అనంతము నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. కరపత్రాలు మరియు ఓ. ఆర్. ఎస్ పాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు నౌషాద్ ఆశా కార్యకర్తలు లలిత అంగన్వాడీ కార్యకర్తలు నజీమున్నిశ, శోభ రాణి, ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముద్దనూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:



స్థానిక పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం 1986, 1991 సంవత్సరంలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు .ఈ సమ్మేళనం కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు మాట్లాడుతూ 36 సంవత్సరాల తర్వాత ఇక్కడ కలుసుకోవడం మీ అందరి అదృష్టంగా భావిస్తున్నానని పాఠశాలకు 50 కుర్చీలు, 27,000 వేల రూపాయలు నగదు ఇచ్చినటువంటి మీ అందరికీ మా పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, ప్రసాదు, రమాదేవి, శివప్రభాకర్ రెడ్డి, మహబూబ్ సాహెబ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

## జాతీయ రహదారిలో తప్పిన ప్రమాదం

ముద్దనూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:



కడప తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలో బుధవారం నాడు తాడిపత్రి వైపు నుంచి ప్రొద్దుటూరు వెళుతున్న టిప్పర్ మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో కి రాగానే సాంకేతిక లోపం సంభవించడంతో వాహనం నియంత్రణ తప్పడంతో డ్రైవర్ చాకచక్యంగా ముళ్ళ పొదలలకి దూసుకెల్లడంతో పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ఏవైనా వాహనాలు వచ్చి ఉంటే పెద్ద ప్రమాదం సంభవించునని, అటుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానిక ప్రజలు ఊపిరిపించుకున్నారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని డ్రైవర్ తెలిపారు.

## తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

తంబళ్లపల్లె ఏప్రిల్ 30 ప్రభాతవార్త ః



సూచనలు ఇస్తున్న ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి

మండలంలోని తాగునీటి సమస్యల పై సచివాలయ ఉద్యోగులు స్పందించకపోతే ఉపేక్షించేది లేదని ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. బుధవారం ఆయన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ కుమార్ తో సచివాలయ ఉద్యోగులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ నేటి నుండే ప్రతి గ్రామం క్షేత్ర స్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలు పై అక్కడికక్కడే పరిష్కరించాలని పరిస్థితి తీవ్రమైతే తమ దృష్టికి తేవాలని సూచించారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలలో ప్రైవేట్ బోర్లతో టైఅప్ లేదా ట్రాన్స్పోర్టింగ్ తో పరిష్కారానికి కృషి చేయాలని తీవ్రమైన సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కార మార్గాలు అన్వేషిస్తామన్నారు. తాగునీటి సమస్యలతో పాటు పారిశుధ్యంపై దృష్టి సారించాలని గ్రామాలలో చెత్తాచెదారం కానరాకుండా గ్రీన్ అంబాసిడర్ల తో చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్ కు తరలించే ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు బద్ధకం వీడి ప్రతి గ్రామం సర్వే చేసి ప్రతి సమస్యను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బద్వేలు, ఏప్రిల్ 30, ప్రభాత వార్త

సచివాలయ సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు బుధవారం ఆయన పలువురు సచివాలయ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించారు. ఎక్కడ కూడా వాటర్ లీకేజీలు లేకుండా చూడటంతో పాటు నీరు ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కాకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. నీటిని వృధా చేయకుండా అవసరం మేరకే వాడుకునేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. నీటి సరఫరా ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ సమస్య లేకుండా చూడాలని, అలాగే వాటర్ లీకేజీలు జరిగితే సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమకుళాయిలు తక్షణమే రెగ్యులర్ చేయించుకోవాలని లేని యెడల కుళాయి కనెక్షన్‌లు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్ హాజరయ్యారు.

## తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

మదనపల్లె, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

శ్మశానాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలంటూ బుధవారం తహశీల్దార్ కార్యాలయంవద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రూరల్ మండలంలోని వేంపల్లి పరిధిలోని కన్నెమడుగువారిపల్లె, దిగువ, ఎగువ కొనగొంట్లవారిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు తమ శ్మశానంను కబ్జా చేయడం అన్యాయమన్నారు. రియల్టర్లు రెచ్చిపోయి ప్రభుత్వస్థలాలు, శ్మశానవాటికలు ఆక్రమించుకొంటున్న అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో స్థలాలను పరిరక్షించాలన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డిప్యూటి తహశీల్దార్ బాబ్జీకి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు క్రిష్ణమూర్తి, గ్రామస్థులు రెడ్డప్ప, రామ్మూర్తి, చంద్రశేఖర్, నారాయణ, నరసింహులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న దృశ్యం

## బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమం

గాలివీడు, ఏప్రిల్ 30(ప్రభాతవార్త):




మండలంలోని వెలిగల్లు గ్రామంలో జమియా మసీద్ నందు బుధవారం రెడ్స్ సంస్థ సీఎస్‌డబ్ల్యు భారతమ్మ ఆధ్వర్యంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా మతపెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయకూడదని, అలా చేయడం వలన బాలికలు ఆరోగ్య సమస్యలతో పాటు చాలా విధాలుగా నష్టపోతారన్నారు. బాలికల వయస్సు 18 సంవత్సరాలలోపు బాలుర వయస్సు 21 సంవత్సరాలలోపు ఉంటే దానిని బాల్య వివాహంగా పరిగనిస్తామన్నారు .బాల్య వివాహం చేస్తే తల్లిదండ్రులపైన, బంధువులపైన కేసులు నమోదు చేసి 2 సంవత్సరాలు జైలుశిక్ష, ఒక లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మీ చుట్టుపక్కల ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్‌కి తెలియజేయాలన్నారు. మతపెద్దలు మాట్లాడుతూ చిన్న పిల్లలకు వివాహం చేయడం వలన శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా, విద్యాపరంగా చాలా నష్టపోతామని తెలుపుతూ బాల్యవివాహరహిత సహజం కోసం ప్రతిజ్ఞ చేయించారు.

## బిజెపి బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలి

తంబళ్లపల్లె ఏప్రిల్ 30 ప్రభాతవార్త ః



బిజెపి నాయకులతో జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్.

తంబళ్లపల్లె మండలంలో బిజెపి నూతన మండల కమిటీ సభ్యులు బిజెపి బలోపేతానికి కృషి చేయాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె బిజెపి కార్యకర్తలతో సమీక్ష జరిపి 16 మంది నూతన మండల కమిటీ సభ్యులకు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ కాశ్మీర్ పుల్వామా లో టెర్రరిస్టులు చేసిన దురాగతాన్ని ప్రతి భారతీయుడు ఖండిస్తున్నాడని టెర్రరిస్టుల భరతం పట్టి పాకిస్తాన్ కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. గత దశాబ్ద కాలంగా ఎన్డీఏ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం అభివృద్ధి బాటలో పయనిస్తోందని భవిష్యత్తులో సైతం బిజెపికి తిరుగు లేదన్నారు. రాష్ట్రంలో సైతం ఎన్ డి ఏ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధిలో పరుగులు పెడుతున్నట్లు చెప్పారు. తంబళ్లపల్లె మండలంలో బిజెపి నాయకులు ప్రజా సమస్యలపై చేస్తున్న కృషిని కొనియాడుతూ భవిష్యత్తులో సైతం సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అనంతరం జుంజురపెంట పంచాయతీ కొత్త రెడ్డివారిపల్లె రోడ్డు ఏర్పాటు పై స్పందించి త్వరలో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట బిజెపి రాష్ట్ర నాయకుడు గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు రమణ, శంకర్ రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, మాజీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, మదన మోహన్ రెడ్డి, స్టోర్ డీలర్ సుబ్బయ్య, లక్ష్మీనారాయణ, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిటి కళాశాలను యూనివర్శిటిగా చేయండి

### బివైఎస్ అధ్యక్షులు పునిత్ డిమాండ్

మదనపల్లె, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న దృశ్యం

ఎంతో చరిత్ర కలిగిన బిటి కళాశాలను యూనివర్శిటిగా చేయాలని బివైఎస్ అధ్యక్షులు పునిత్ డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలసి ఆయన విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బిటి కళాశాలను యూనివర్శిటిగా చేసేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారన్నారు. బిటి కళాశాలలో గతంలో తొలగించిన ఏయిడెడ్ కోర్సులను తిరిగి ప్రారంభించి, విద్యార్థులకు ఉపయోగపడే నూతన కోర్సులను ప్రారంభించి యూనివర్శిటిగా ప్రకటిస్తామని గతంలో ఎమ్మెల్యే ఎన్నికల హామీల్లో ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నూతన విద్యాసంవత్సరం నుంచి యూనివర్శిటీ మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో బిటి కళాశాలను ప్రభుత్వపరం చేస్తూ జీఓ ఇచ్చారని ఇప్పటి వరకు కళాశాల ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని జీఓ కేవలం గాలిలో దీపంలాగా ఉందన్నారు. గతంలో షాజహాన్‌బాషా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా కళాశాల అభివృద్ధికి రూ.6కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న కళాశాల అభివృద్ధి పనులు కూడా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశికుమార్, హరిక్రిష్ణ, నితీన్, వినయ్, సాయికిరణ్, భార్గవ్, బాలక్రిష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్‌కు ఆత్మీయ వీడ్కోలు

సుండుపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ నరసయ్యకు ఆత్మీయ వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ వరప్రసాద్ మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్య పోలీసు శాఖలో అంకితభావం తో విశేష సేవలు అందించారని, క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించడంతో పాటు, ప్రజలకు అహర్నిశలు సేవలు అందించారని ప్రశంసించారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదైనా, సమాజ రక్షణ కోసం సేవ చేయడం గొప్ప గౌరవంగా అభివర్ణించారు. పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ సుమారు 38 సంవత్సరాల పాటు విధులు నిర్వహించి, పోలీసు శాఖకు విశేష సేవలు అందించారని ఎస్సై శ్రీనివాసులు కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

## మానవ హక్కుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న తాసిల్దార్ భీమేశ్వరరావు

పీలేరు ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

మండలంలోని బాలం వారి పంచాయతీ మొరవ పల్లి హరిజనవాడలో మానవ హక్కుల దినోత్సవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గ చైర్మన్ గా అధ్యక్షత వహించారు. అందులో అఖిల భారత మాల సంఘాల జేఏసీ పీలేరు మండల అధ్యక్షుడు గుండ్లూరి నాగరాజు పలు విషయాలపైన హక్కులు అవసరాల గూర్చి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినారు. ప్రధానమైనటువంటి స్మశాన వాటిక, నాలెవండ్లపల్లి నుండి మొరవపల్లికి రేషన్ రేషన్ షాపుకు వెళ్లడానికి రావడానికి ,విద్యార్థులు బస్సు దిగిన తర్వాత పల్లెకు రావడానికి ఊరికి కలిగిన హక్కు దారి నుంచి రావడానికి చాలా కష్టంగా ఉన్నది. ఈ విషయమై ఊరి ప్రజలందరూ కలిసి సంతకాలు చేసి వినతి పత్రము తహసీల్దారుకు అందజేశారు. గుండ్లూరి భాగ్యలక్ష్మి బాలంవారిపల్లిలో అగ్రికల్చర్ ట్రాన్స్ఫార్మర్‌ఏర్పాటు చేస్తున్న హరిజన మహిళకు అదే బాలంవారిపల్లి ఊరికి చెందినటువంటి పొన్న వినోద్, పొన్న హరీష్ గుడికిదారికీ, రైతు పొలాలకు వెళ్లే దారి పైన కూడా రానీయకుండా ముండ్లకంచవేసి దౌర్జన్యంగా అడ్డగించినారని కుల వివక్షతో తీవ్రంగా నానా మాటలు అని కించపరిచి, అవమానపరిచారని వారిని కఠినంగా శిక్షించాలని అర్జీ ఇచ్చినారు. బలం వారి పల్లిలో శ్రీ గుండూరి నాగరాజు 28 జూన్ 1994 సంవత్సరమున వారి సొంత భూమికి దారి లేక శ్రీ ముద్దనూరి రామయ్య గారి కుటుంబ సభ్యుల దగ్గర రెండు కుంటలు దారి నిమిత్తమై కొన్నారు. అయితే 30 సంవత్సరాలు వారు యదేచ్ఛగా అనుభవిస్తూ ఉండగా ఈ మధ్యకాలంలో వారికి ఉపాధి హామీ పథకం ద్వారామామిడి చెట్లు వచ్చి నాటుకుంటున్న ఏడు నెలల తర్వాత కొన్న వారిని పొలంలోకియకుండా ముండ్ల కంచ వేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డ్ ఈకేవైసీ నిరంతర ప్రక్రియగా మార్చాలి

### పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్

పులివెందుల,ఏప్రిల్ 30, ప్రభాతవార్త:



పులివెందుల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు నాలుగవ వార్డ్ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 30వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది, అయితే రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి అని లేదంటే రేషన్‌తో పాటు ప్రభుత్వ పథకాలు నిలిచిపోయే అవకాశం ఉందనే కూటమి ప్రభుత్వ నిర్ణయం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది , ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు ,ఇతర ప్రాంతాలలో చదువు కుంటున్న పిల్లలు పరీక్షల సమయంలో సొంత ప్రాంతాలకు రావాలంటే ఇబ్బందిగా ఉందని పిల్లల తల్లి తండ్రులు మరియు వలసదారులు ఆందోళన చెందుతున్నారు, ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయమైనా ప్రజలకు మేలు చేకూర్చేలా ఉండాలని , ఇలాంటి నిర్ణయాల వలన ప్రజలు రేషన్ కార్డు కోల్పోయే ప్రమాదం ఉందని కావున ప్రభుత్వం ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఈ ప్రక్రియ ను నిరంతర ప్రక్రియగా చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## జాబ్ మేళాకు విశేష స్పందన

పులివెందుల,ఏప్రిల్30, ప్రభాతవార్త:



పత్రాలు అందిస్తున్న ప్రతినిధులు

జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. బుధవారం పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద ఆదిత్య బిర్లా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా అధికారులు మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ప్రత్యేకించి మహిళల కోసమే ఏర్పాటు చేశారని దీనిని అర్హులైన మహిళలందరూ సద్వినియోగపరచుకోవాలన్నారు. టైలరింగ్ కు సంబంధించిన నిరక్షరాశులతో పాటు ఐదవ తరగతి నుంచి డిగ్రీ చదివిన మహిళలు కూడా పాల్గొని వారి అర్హతలను బట్టి ఉపాధిని పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో 185 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 150 మంది సెలెక్ట్ అయ్యారు. ఈ కార్యక్రమంలో అధికారులు మెప్మా అధికారి సియం యం హరిప్రసాద్, రామాంజనేయులు, నాగలక్ష్మి, ఆదిత్య బిర్లా కంపెనీ ప్రతినిధులు జయకుమార్ ప్రభాకర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి బాయ్ పూలె విగ్రహం ఏర్పాటు చేయాలి

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 30 ప్రభాతవార్త



భారతదేశంలో మహిళా విద్య మరియు సామాజిక సంస్కరణలకు పునాది వేసిన మహోన్నత వ్యక్తి సావిత్రి బాయి పూలే గారి విగ్రహం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేయాలనీ డిఇఓ షంషుద్దీన్‌కి వినతిపత్రం సమర్పించారు . అనంతరం ఆర్వైఎఫ్ జిల్లా కార్యదర్శి భరత్ల మాట్లాడుతూ సావిత్రి పూలె విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు అన్నారు. ఆమె స్థాపించిన మొట్టమొదటి బాలికల పాఠశాల భారత విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా మారింది. ఆమె ఆదర్శాలు ఈ రోజున కూడా విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు స్ఫూర్తినిస్తాయి అని తెలిపారు. దీనికి స్పందించిన డిఇఓ ప్రయత్నం చేస్తామన్నారు. ఇది విద్యార్థులు మరియు సందర్శకులలో విద్య మరియు సామాజిక న్యాయం పట్ల అవగాహనను పెంపొందిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పి ఎస్ యు నాయకులు గోపి సురేంద్ర పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 30 ప్రభాతవార్త




ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరు రోడ్డు లోని నజరుల్లా షా దర్గా స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నజరుల్లా షా దర్గా మఠం అభివృద్ధి కమిటీ సెక్రటరీ షేక్ సలీం.బాష విజ్ఞప్తి చేశారు బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నజారుల్లా షా దర్గా నిర్వహణ, అభివృద్ధి కోసం ఇంత స్థలాన్ని విరాళంగా ఇచ్చినట్లు వీలునామా వ్రాసిన సంగతిని గుర్తు చేశారు ఆ వీలునామాలో నజారుల్లా షా వారసులు మరియు శిష్యులు ఆధ్వర్యంలో దర్గా నిర్వహణకు అభివృద్ధికి అవసరమయ్యేలా చూడాలని రాసినట్లు తెలిపారు కానీ కొంతమంది అక్రమనదారులు ఆ స్థలాలలో అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో దర్గా అభివృద్ధి కమిటీ కోర్టును ఆశ్రయించిందన్నారు. హైకోర్టు వారు దర్గా కమిటీకి అనుకూలంగా స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు దర్గా స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించింది హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ దర్గా స్థలంలో కోర్టు యాజమాన్య హక్కులు తేల్చేంతవరకు ఎటువంటి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయమని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయి నా ఆక్రమణదారులు ఇటీవల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నా రని తక్షణమే ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని దర్గా స్థలంలో ఎటువంటి నిర్మాణాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దర్గా ట్రస్టీ సభ్యులు బాబా ఫక్రుద్దీన్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన ఎంపి మేడా రఘునాథ్ రెడ్డి

**3 పార్లమెంట్ నియోజకవర్గాలకు పరిశీలకులుగా జిల్లా నేతలు**

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పార్టీ పటిష్టతపై దృష్టి సారించారు.అయా పార్లమెంట్ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించారు. పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని నేతలతో సంబంధాలు ఉన్న నాయకులను పరిశీలకులుగా నియమించారు. జిల్లాకు చెందిన ముగ్గురు నేతలను రాజంపేట, కడప ,తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులుగా నియమించడం విశేషం. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి ని నియమించారు. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకునిగా కడప మేయర్ కె.సురేష్ బాబును నియమించారు.కడప పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకునిగా రాష్ట్ర వైఎస్సు అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండూరు అజయ్ కుమార్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు ముగ్గురు నేతలకు జగన్మోహన్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు.

## రసబసాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**మదనపల్లె, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం రసాబసాగా జరిగింది. బుధవారం ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. తొలుత పహల్గాలో ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారికి కౌన్సిల్‌లో ఛైర్‌పర్సన్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు సంతాపం తెలిపారు. అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ వార్డుల్లో ప్రజా అవసరాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కౌన్సిలర్లు గాంధీ, కరీముల్లా, తులసీరామక్రిష్ణలు మాట్లాడుతూ గత కౌన్సిల్‌లో పేర్కొన్న అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాను రద్దు చేసి తిరిగి వార్డులకు సమన్యాయం జరిగేలా అభివృద్ధిపనులకు కేటాయించాలన్నారు. కొన్ని వార్డులకే అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు ఎక్కువగా కేటాయించారని తమ వార్డులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతలోనే 6వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా అవసరాల మేరకే వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అజెండాలో పేర్కొవడం జరిగిందన్నారు. కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ అజెండాలో పేర్కొన్న 33అంశాలకు సంబంధించి 26 వాటికి ఆమోదించడం జరిగిందని, 7 అంశాలను తిరస్కరించడం జరిగిందని కౌన్సిల్‌లో తెలిపారు. మెజార్టీ కౌన్సిల్ ఆమోదం ప్రకారం కొన్ని వార్డులకు తిరస్కరించడం జరిగిందన్నారు. దీంతో కౌన్సిల్‌లో ఛైర్‌పర్సన్, ముగ్గరి కౌన్సిలర్ల మధ్య రసాబసాగా చర్చ జరిగింది. పాలకపక్షం కావాలనే కొన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి వివక్షత చూపుతోందని కొందరు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి మెజార్టీ కౌన్సిల్ ఆమోదం తెలపడంతో కౌన్సిల్ సమావేశం ఏట్టకేలకు ముగిసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, డిఈ శ్రావణి, మేనేజర్ మనోహర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఆమోదం తెలుపుతున్న దృశ్యం

## చెట్లను నరికివేయడం హత్య కంటే దారుణం!

**(పర్యావరణానికి హాని కలిగించే వారి పట్ల కరుణ కూడదు-సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు)**

**బద్వేలు లీగల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**

చెట్లను నరికివేయడమంటే వ్యక్తిని హత్య చేయడం కంటే దారుణమని పర్యావరణానికి కీడు కలిగించే ఎవరి పట్ల కూడా కరుణ వహించరాదని సుప్రీం కోర్టు సుస్పష్టం చేసింది. వివరాలలోకి వెళితే... ఉత్తరప్రదేశ్‌లోని తాజ్ ట్రిపీజియం జోన్‌లో అక్రమంగా చెట్ల నరికివేత కేసుపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టి అనుమతి లేకుండా 454 చెట్లను నరికివేయడం ఖండించదగ్గ అంశమని, పచ్చని ప్రాంతాన్ని తిరిగి సృష్టించడానికి కనీసం వంద సంవత్సరాలు సమయం పడుతుందని ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ నివేదిక ప్రకారం గతేడాది సెప్టెంబరు 18 రాత్రి బృంధావన్ చటికారా రోడ్డులో దాల్మియా ఫాం అనే క్షేత్రంలో 422 చెట్లను పక్కనే రోడ్డు వెంబడి ఉన్న రక్షిత అటవీ ప్రాంతంలోని చెట్లను అక్రమంగా నరికివేశారు. ఈ చెట్లను నరికినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యాపారవేత్తకు ఒక్కొక్క చెట్టుకు లక్ష రూపాయలు ప్రకారం జరిమానాను కూడా ధర్మాసనం విధించింది. ఆ వ్యాపార వేత్త తప్పును అంగీకరించి క్షమాపణలు కోరుతూ మొత్తాన్ని తగ్గించాలని, ఒకే చోటున కాకుండా సమీప ప్రాంతాల్లో మొక్కలు నాటడానికి అనుమతించాలని కోర్టును అభ్యర్థించగా న్యాయస్థానం జరిమానా తగ్గించడానికి నిరాకరిస్తూ సమీప ప్రాంతాల్లో చెట్లను నాటడానికి అనుమతిస్తూ ఈ తీర్పును వెలువరిస్తూ పర్యావరణానికి హాని కలిగించే వారి పట్ల ఏలాంటి దయ చూపరాదని ఆదేశించింది. (యం.సి. మెహతా ఎదిరి యూనియన్ ఆఫ్ ఇండియా, డబ్ల్యుపి సివిల్ నెం.1338 ఆఫ్ 1984)

## మహిళల ఆర్థిక ప్రగతికి

## మెప్మా బజార్లు దోహదం చేస్తాయి



**మైదుకూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతికి మెప్మా అర్బన్ బజార్లు దోహదం చేస్తాయని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కేజియా జాస్లీన్, తెలిపారు. మైదుకూరు పట్టణ కడప రోడ్డు ఎంపీడీవో ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ బజార్ ప్రతి నెల అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేసి, మెప్మా లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు చేతి వృత్తులలో తయారు చేసిన ఉత్పత్తులను అర్బన్ బజార్ ద్వారా విక్రయిస్తారన్నారు. స్వయం సంఘాల మహిళల ఆర్థిక అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను తయారు చేయటం ద్వారా మంచి లాభాలను సాధించవచ్చునన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్ లో తినుబండారాలు,జ్యూస్ బండి, రోల్డ్ గోల్డ్, చీరలు, స్టీల్ సామాన్, తదితర స్టాల్స్ ను తిలకించారు.ఈ కార్యక్రమంలో సి ఓ కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వై పెద్ద పుల్లయ్య, రమణమ్మ,ఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బసవ జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వర స్వామి



గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

**పులివెందుల,ఏప్రిల్30, ప్రభాత వార్త:**

పులివెందుల పట్టణంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం(బసవన్న కట్ట) లో బుధవారం 892వ బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురు జంగమ వీరశైవ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఉమామహేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. రెడ్డి విశ్వనాథం, ఉమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా తయారు చేయించిన రూ.1.25 లక్షల విలువ చేసే బసవేశ్వరస్వామి పంచలోహ విగ్రహాన్ని చేయించారు. ఈ సందర్భంగా వారు తమ ఇంటి వద్ద నుంచి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయంలో కొలువుతీర్చారు. అనంతరం విశేష పూజలు నిర్వహించా రు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో బసవేశ్వరుడిని ఉంచి ప్రత్యేకంగా అలంక రించారు. గ్రామోత్సవం వెంబడి వీరశైవ లింగాయతి మహిళలు కలశాలు పట్టుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు హరహర మహదేవ శంభో శంకర, జై బసవేశ్వర నామస్మరణలతో ముందుకు సాగారు. ఈ గ్రామోత్సవంలో కొత్తపల్లె పవన్ బృందంచే కోలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. గ్రామోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికాల వీరి, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, ముత్యాల వారి వీధి. గాడిచర్ల వారి వీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.

## ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం



**యర్రగుంట్ల ఏప్రిల్ 30 ప్రభాతవార్త**

మున్సిపాలిటీ పరిధిలోని కడప రోడ్డులో సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు. యర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో 2 ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పుడు శిక్షణ కోసం 410 మంది అప్లై చేశారు. ఈ శిక్షణ కేంద్రంలో ఉదయం 70 మంది సాయంకాలం 70 మందికి 90 రోజులు శిక్షణ ఇస్తారు. మొదటి వేడుకగా 240మందికి శిక్షణ ఇస్తాము, విడతల వారీగా ఎంతమందికైనా శిక్షణ ఇస్తాము అన్నారు.ఈ శిక్షణ కాలంలో 80 శాతం ఆంజనేయులు హాజరు ఉన్నవారికి ఉచిత కుట్టుమిషన్ పంపిణీ చేయబడునని బీసీ కార్పొరేషన్ కుట్టుమిషన్ డిస్టిక్ ఇంచార్జ్ కోటీశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నియోజకవర్గం శాసనసభ్యులు చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, కడప పార్లమెంట్ ఎన్ డి ఏ కూటమి ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మూలే హర్షవర్ధన్ రెడ్డి, యర్రగుంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగరాజు, మున్సిపల్ కమిషన్ శేషపాణి తెలుగుదేశం బిజెపి మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హంసవాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు

**కురబలకోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**



తెట్టులో వెలసిన శ్రీ సంతాన వేణుగోపాల్‌స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హంసవాహనంపై కొలువుదీరి తెట్టు పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో వాహన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజారివారిపల్లెకు చెందిన భక్తాదులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా మేళాలు, పిల్లనగ్రోవి వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద పూజారి చిన్నగంగులప్ప కుటుంబసభ్యులు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాట చేశారు. హంస వాహనం ఊరేగింపు ఏర్పాట్లను పూజారి అంజిప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి సింగన ఓబుల్ రెడ్డి

**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**

41 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి సింగన ఓబుల్ రెడ్డి అని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం బద్వేలులోని స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో గోపవరం మండల విద్యాశాఖాధికారి పి.రఘురామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సింగన ఓబుల్ రెడ్డి పదవి విరమణ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సందర్భంగా నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృత్తి పట్ల అంకిత భావం, సమయపాలన, క్రమశిక్షణ, ఓర్పుగా నేర్పుగా పనిచేసే వ్యక్తిత్వం ఓబుల్ రెడ్డికే స్వంతమన్నారు. 41 సంవత్సరాలు విద్యా క్షేత్రంలో ఉపాధ్యాయునిగా పని చేసి ఎంతోమందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఘనత ఓబుల్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటు ఉపాధ్యాయునిగా, అటు ఉపాధ్యాయ సంఘం నాయకునిగా సమన్వయంతో ముందుకు సాగుతూ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలోనూ, ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించడంలోనూ క్రియాశీలకంగా వ్యవహరించాడన్నారు. నేటి ఉపాధ్యాయలోకం సింగన ఓబుల్ రెడ్డి లాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. యుటిఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా మాట్లాడుతూ జిల్లాలో యుటిఎఫ్ ఉద్యమాన్ని నిర్మించడంలో సింగన ఓబుల్ రెడ్డి పాత్ర గణనీయమైనదన్నారు. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎన్ని ఆటుపోటులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగిన ధీరోదాత్తుడన్నారు. యుటిఎఫ్ లో మండల అధ్యక్షునిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన సింగన ఓబుల్ రెడ్డి జిల్లా అధ్యక్షునిగా, జిల్లా గౌరవాధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నో ఉన్నతమైన పదవులు నిర్వహించారన్నారు. పదవులకు వన్నె తెచ్చిన ఆదర్శ వ్యక్తిగా నిలిచాడని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన సింగన ఓబుల్ రెడ్డి వారి సతీమణి సుబ్బమ్మ ను పలువురు శాలువా పూలమాలలతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్, ఎస్టీయూ జిల్లా నాయకులు చల్లా నరసింహారెడ్డి, డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రవిశంకర్ లు మాట్లాడుతూ సింగన ఓబుల్ రెడ్డి పదవీ విరమణ ఉపాధ్యాయ లోకానికి తీరని లోటన్నారు. మృదు స్వభావిగా, స్నేహశీలిగా పేరుపొందిన ఓబుల్ రెడ్డి అజాతశత్రువుగా నిలిచాడన్నారు. ఆయన పదవీ విరమణ అనంతరం కూడా సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎన్.చన్నయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, గౌరవ అధ్యక్షుడు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షుడు వై.రవికుమార్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి పీఆర్టీయూ జిల్లా నాయకులు పి.గోపాల్ రెడ్డి, ఎస్టీయూ జిల్లా సీనియర్ నాయకులు వెంకటరమణయ్య, పి.వి.కృష్ణారెడ్డి ఆపస్ జిల్లా నాయకులు సుబ్బరాయుడు, వెంకటరామిరెడ్డి, ఎంఈఓ ఎం.సునీల్ కుమార్, విశ్రాంత ఎంఈఓలు శీలం గంగన్న, రామచంద్రారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు ఏ.వి.రమణయ్య, విజయ కుమారి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, సత్యానంద రెడ్డి, పాల శ్రీనివాసులు రెడ్డి పబ్బతి చక్రపాణి, ఉరిమి సుబ్బారావు, సింగన సుధాకర్ రెడ్డి మరియు సింగన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సింగన ఓబుల్ రెడ్డి సేవలకు అంతులేదు : అట్లూరు మండలం చెర్లోపల్లె గ్రామానికి చెందిన సింగన పెద్దముని రెడ్డి సతీమణి లక్ష్మమ్మ గారికి 9 మంది సంతానంలో 8,వ సంతానమైన సింగన ఓబుల్ రెడ్డి 01,05,1963 జన్మించారు, వారు టిటిసి రాయచోటి, బిఈడి ఎస్ వి యూనివర్సిటీ లో విద్యను అభ్యసించారు,24,3,1984 ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు, సింగన ఓబుల్ రెడ్డి ఉపాధ్యాయులుగా 18 సంవత్సరాలు ప్రదానో పాధ్యాయులుగా 23 సంవత్సరాలు సుమారు 41 సంవత్సరం పైగా అనేకమంది విద్యార్థులకు విద్యాబోధన చేసి వారు ఎంతోమంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారు, సింగన ఓబుల్ రెడ్డి అట్లూరు మండలం గోపవరం, బద్వేలు, బి కోడూర్ మండలాలలో అనేక పాఠశాలలో పనిచేసి విద్యార్థుల విద్యాభ్యాసం చేసి విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మోలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో కూడా వారు సేవలు ప్రశంసించారు, ముఖ్యంగా వారు పనిచేసిన పాఠశాలలో మద్దూరు తూడూరు, పాటిమీద పల్లి, కుంబగిరి, బద్వేల్ మండల అమ్మవారి శాల వీధి, ఎగవ నేలటూరు, బొమ్మలాటపల్లె, కోటవీధి, రామాపురం కోటిరెడ్డి నగర్ తోపాటు పాఠశాలలో పనిచేసి చివరగా నేడు కోటిరెడ్డి నగర్ హై స్కూల్ లో పదవీ విరమణ పొందడం ఆయన సేవలకు అంతులేవని శ్రీ కోదండరామ స్వామి దేవాలయం అధ్యక్షులు కోటపాటి వెంకటసుబ్బారెడ్డి, మారం రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జమ్మన శేఖర్ రెడ్డి, తో పాటు పలువురు వారి సేవలను ప్రశ్నించారు, వారి పదవీ విరమణ అనంతరం వారి శేష జీవితం కూడా సుఖసంతోషాలతో గడవాలని వారికి భగవంతుడు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని పలువురు వారి సేవలను ఆకాంక్షించారు







## అక్రమార్కుల లెక్కలు తేల్చాం



సమావేశంలో మాట్లాడుతున్న రాయచోట ఆర్డీవో శ్రీనివాస్

**పీలేరు ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**

పీలేరులోని ఎన్టీఆర్ కాలనీల్లో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు లెక్క తేల్చామని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన పీలేరులో పర్యటించారు. ఏపీఐఐసీ, 1, 2, 3, కాలనీలల్లో విచారణ చేపట్టి 8,468 ఇళ్ల స్థలాలను విచారించగా 5,381 మంది లబ్దిదారులు అర్హులుగా గుర్తించగా 3,087 మంది అనర్హులుగా గుర్తించామని ఆయన తెలిపారు. వీరిలో కూడా అర్హులెవరైనా ఉన్నారా అని విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. 3,464 మంది ఇళ్లు లేవని దరఖాస్తులు చేసుకున్నారని, ఇళ్లు కట్టుకోవడానికి స్థలం. ఉందని 331 దరఖాస్తులు చేసుకోగా 304 మందికి ఆమోదం తెలిపామని ఆర్డీవో తెలిపారు. ఇంకనూ ఇళ్లు లేనివారు ఉంటే గ్రామ సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీలేరులో జరుగుతున్న అర్వోబీ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశించామని ఆయన తెలిపారు.

## శ్రీ సీతారామ స్వామి వార్షికోత్సవ వేడుకలు



**దువ్వూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోని శ్రీ సీతారామచంద్ర స్వామి ద్వి దశాబ్ది వార్శికోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ స్వామి దేవస్థానం నందు వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించగా, 10గంటలకు శ్రీరామ కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడ ఏర్పాటుచేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**దువ్వూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన 23గ్రామ పంచాయతీల్లో మే 1వ తేదిన పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మే 1వ తేదిన మండలంలోని 63మంది వితంతువులకు కొత్తగా పింఛన్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. భర్తకు పింఛన్ వస్తూ మరణించిన వారి భార్యకు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 7182మంది పింఛన్ దారులకు 128 మంది సిబ్బందిచే 3కోట్ల 5లక్షల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

## మైనార్టీ రుణాలకు ధరఖాస్తులు చేసుకోండి

**కురబలకోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం మైనార్టీల ఆర్థికాభివృద్ధికోసం సబ్సిడీ రుణాల కోసం నిధులను కేటాయించిందని ఎంపిడిఓ గంగయ్య తెలిపారు. అల్ప సంఖ్యాకులైన ముస్లింలు, క్రిస్టియన్లు ఆన్‌లైన్‌లో సబ్సిడీ రుణాలకు ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. కురబలకోట మండలానికి 51యూనిట్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. సిటిఎం ఇండియన్ బ్యాంకుకు 11, కురబలకోట ఇండియన్ బ్యాంకు 11, తెట్టు ఇండియన్ బ్యాంకు 11, ముదివేడు గ్రామీణ బ్యాంకు 9, అంగళ్ళు స్టేట్‌బ్యాంకు 9 యూనిట్లు రుణాలకు అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.




## అక్రమ గ్రావెల్ క్వారీని పరిశీలించిన అధికారులు

**దువ్వూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

దువ్వూరు, మైదుకూరు మండలాల మధ్య వివాదాస్పదమైన అక్రమ గ్రావెల్ క్వారీని బుధవారం రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్ అసిస్టెంట్ జియాలిస్ట్ కృష్ణమూర్తి, డైరెక్టర్ సుబ్రమణ్యం తదితరులు మైదుకూరు మండలం గడ్డమాయిపల్లె వద్ద సర్వేనెంబర్ 83లో అక్రమ మైనింగ్ గురించి ఫిర్యాదులు వెళ్లడంతో వీటిని పరిశీలించారు. కాంట్రాక్ట్ సంస్థ చింతకుంట గ్రామ పొలంలో అనుమతులు తీసుకొని సమీపంలోని గడ్డమాయి పల్లెలో అక్రమంగా గ్రావెల్ తవ్వారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆ ప్రాంతంలో సుమారు 3గంటల సేపు అక్రమంగా తవ్విన ప్రతి చోట కొలతలు తీసుకున్నారు. ఈ అక్రమ మైనింగ్ గురించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. విజిలెన్స్ స్క్వాడ్ జాయింట్ ఇన్స్పెక్షన్ మైదుకూరు, దువ్వూరు మండలాల రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేస్తామని గతంలో తెలిపారు. అయితే బుధవారం మైదుకూరు రెవెన్యూకు సంబంధించిన వీఆర్వో, సర్వేయర్, రెవెన్యూ అధికారులు ఎవ్వరూ రాలేదు. కేవలం దువ్వూరు మండలానికి సంబంధించిన సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ అలాగే మైనింగ్ అధికారులు కలిసి అక్రమంగా తవ్విన ప్రాంతాన్ని పరిశీలించి కొలతలు తీశారు. ఏ పరిమాణం మేరకు గ్రావెల్ తవ్వారనే నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తున్నట్లు తెలిసింది.



## ఉద్యోగుల సేవలు

## ఉద్యోగ విరమణ తర్వాతే తెలిసి వస్తాయి

**పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ నిర్మల**



ఉద్యోగులను సత్కరిస్తున్న డిపో మేనేజర్ నిర్మల

**పీలేరు ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**

ఉద్యోగులు తమ విధుల్లో ఉన్నప్పుడు కన్నా వారి ఉద్యోగ విరమణ తర్వాతే వారి సేవలు ఎంత విలువైనవో తెలుస్తాయని పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ నిర్మల తెలిపారు. బుధవారం పీలేరు ఆర్టీసీ డిఎం కార్యాలయం ముందు స్థానిక డిపోలో 38 ఏళ్లపాటు కండక్టర్లుగా పనిచేసిన కెఎస్ మన్యం, ఎన్ఎస్ చంద్రల ఉద్యోగ పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిపో మేనేజర్ నిర్మల, ఎన్ఎంయు పీలేరు డిపో గౌరవాధ్యక్షులు ఎల్లెల రెడ్డప్పరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పుడు అంకిత భావంతో వారు పనిచేసినందుకు నిదర్శనంగా ఉద్యోగ విరమణ సందర్భంలో వారి సేవలను సహోద్యోగులు, తమ ఉన్నతాధికారులు మననం చేసుకుని మాట్లాడడానికి మంచి విషయాలు ఉంటాయని అన్నారు. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందుతున్న కెఎస్ మన్యం, ఎన్ ఎస్ చంద్ర ల గురించి వారి అధికారులు, తమతో పాటు పనిచేసిన ఉద్యోగులు ప్రశంసించడం చూస్తుంటే తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. సంస్థ ఆదాయ అభివృద్ధికి, తోటి కార్మికుల అభ్యున్నతికి వారు ఎంతో మంచి సేవలు అందించాలని పలువురు వక్తల ద్వారా తెలుస్తోందని చెప్పారు. సివి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ నిర్మల, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, ఎంఎఫ్ హరినాథ్ రెడ్డి, సూపర్వైజర్లు, అన్నమయ్య జిల్లా కార్యదర్శి పిఎస్ఎం రాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఏఆర్ చంద్ర, ఆదినారాయణ, డిపో ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్బరామయ్య, బి.ఆర్.బి నాయక్, ఎంహెచ్ నాయుడు, రఘు, శివశంకర్, రమేష్, ఎన్ఎంయు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.